# అనుపమ_ఆకాశ్

• గోగినేని మణి

అను..వ..మా..

మునుపటిలా నిన్ను 'అనూ' అని చనువుగా పిలవటానికి ఎందుకో కొంచెం సంకోచంగా అనిపించింది! ఈ ఉత్తరం చదివాక, అలా పిలవగలిగే స్వతంత్రాన్ని నువ్వే ఇవ్వగలవని నాకు నమ్మకంగా అనిపిస్తోంది!

ఇంతకు మునుపు మనిద్దరం చూసిన సినిమాల గురించి, టీవీ ప్రోగ్రాములనూ విశ్లేషిస్తూ చర్చించటం, ఆ చర్చలను సరదాగానే ముగించటం జరిగేది కదా..! కానీ.. నాలుగు రోజుల క్రితం.. ఒక సినిమా ముగింపు నాకు నచ్చలేదని చెప్పగానే.. నీకంత ఆవేశం ఎందుకు వచ్చిందో..! ఆ మాత్రానికే.. న్యాయం వైపు కాకుండా, పురుష పక్షపాతిలా మాట్లాడానని తీర్మానించేశావ్!

పెళ్లికి ముందు మనం కలసి చూసిన ఒక సినిమా గురించి.. 'హీరోయిన్ భర్త వలన రకరకాలుగా హింసకు గురవుతూ కూడా అలా అతని దగ్గరే ఉండటమెందుకూ, విడిచి వెళ్లాలిగానీ' అని నేననటం నిజమే..! ఆ మాటల్ని ఉదహరిస్తూ.. మన పెళ్లి అవగానే, అసలు నైజాన్ని బయటపెడుతూ మగవాళ్లని సమర్థిస్తున్నానని ఆరోపించావ్! నీ మాటలకు నవ్వాలో, ఏమనుకోవాలో తెలియలేదు! రెండు సందర్భాల్లోనూ భార్యాభర్తల సమస్యేగానీ స్వరూపం మాత్రం పూర్తిగా వేరే వేరే కదా! అందుకే కదా, నేను ఆ సినిమా ముగింపు ఇంకో విధంగా ఉంటే బావుండేదని అన్నాను! సమస్యని బట్టే పరిష్కార మార్గం ఉండాలి గానీ, అన్ని రోగాలకీ ఒకటే మందులా అనలేం..! నిజమేగా..?

మీ ఇంటికి వెళ్లాలని అంతకుముందే సర్ది ఉంచుకున్న సూట్‌కేసును తీసుకొని కోపంగా వెళ్లిపోతూ.. నా వివరణ బట్టే నీ స్పందనా ఉంటుందని చెప్పావ్! తమాషాకి అలా అన్నావని మొదట అనుకున్నాగానీ, ఈ నాలుగు రోజులుగా, నా పలకరింపులకు బదులివ్వకుండా ఫోన్ ఆపేయటాన్ని బట్టి, నువ్వు సీరియస్‌గానే భావిస్తున్నావని అర్థమైంది!

అందుకే, ఇక ఆలస్యం చేయకుండా.. నీతో వివరంగా మాట్లాడదామని, కంప్యూటర్ ముందు కూర్చుని, నీకిలా ఉత్తరం రాయటం మొదలుపెట్టాను.

మన మనసులలో.. ఒక మూల ఒదిగి ఉండిపోయిన కొన్ని సంఘటనల జ్ఞాపకాలు, మనకు విలువైన పాఠాలనే నేర్పిస్తాయి! ప్రేమ, క్షమ.. ఒకే నాణేనికి ఉండే బొమ్మ, బొరుసులాంటివని అనుకుంటాను. ఈ అభిప్రాయానికి బలం చేకూర్చిన సంఘటనలు వివరిస్తాను. మరి మొదలుపెట్టనా..?

హైస్కూలు చదువులో ఉండగా జరిగిందిది. స్కూలు వదిలాక ఇంటికి వచ్చిన నేను ముందుగదిలో జరిగినది చూసి నిశ్చేష్టుడనై గుమ్మం దగ్గరే రెండు క్షణాలు నిలబడిపోయా.

'ఎన్నిసార్లు పదే పదే అదే మాట చెబుతావ్.. నా మాటంటే లక్ష్యం లేదా..?' అంటూ నాన్న ఆవేశంగా అమ్మ చెంపమీద ఒక్కటిచ్చాడు!

అమ్మ కూడా కొయ్యబారినట్లయిపోయి.. వెంటనే తేరుకొని, గదిలోకి వెళ్లిన నాన్నని అనుసరించి తనూ వెళ్లింది. నేను కూడా నెమ్మదిగా అమ్మ వెనకాలే వెళ్లి గుమ్మం దగ్గరే ఆగిపోయాను.

నాన్న అలా అమ్మ మీద చేయి చేసుకోవటం నేనెప్పుడూ చూడలేదు. అమ్మ.. నాన్న షర్టు పట్టుకొని ఎందుకలా చేశారని నిలదీస్తుందనుకున్నాను. కానీ.. అక్కడ జరుగుతున్నది వేరేగా ఉంది!

దెబ్బ తిన్న అమ్మే నాన్న తల నిమురుతూ 'ఏమైంది.. ఆఫీసులో ఏమైనా జరిగిందా..? ఎందుకంత ఆవేశం వచ్చింది..?' అని అనునయిస్తోంది! నాకైతే చాలా చిత్రంగా అనిపించింది. వెనక్కి వచ్చేశా.

ఊరు నుండి ఏదో శుభకార్యానికని వచ్చిన నానమ్మ, తాతయ్య, అమ్మమ్మ, మా మేనత్త అంతా ఆ ముందుగదిలోనే కూర్చుని ఉన్నారు. నేనూ ఒక వార బల్లమీద కూర్చుండిపోయాను.

రెండు నిమిషాలకే అమ్మ గదిలో నుండి వచ్చి, వంటగదిలోకి వెళ్లి అందరికీ 'టీ' చేసి తీసుకువచ్చింది. ఏమీ జరగనట్లు మామూలుగానే ఉంది.



అత్త నాన్నని టీ తాగటానికి రమ్మని కూర్చున్న చోట నుండే కేక పెట్టింది.

నాన్న వచ్చి అమ్మ పక్కనే కూర్చుని, అమ్మ చేతిని తన చేతిలోకి తీసుకుని తన చెంపకు రెండుసార్లు తాటించి 'ఆవేశంలో తప్పు చేశాను. ఇది చాలా..? కోపం పోలేదంటే కాళ్లూ పట్టుకుంటాను..' అన్నాడు క్షమాపణ కోరుతున్నట్లుగా.

అమ్మ మొహంలో కనిపించిన చిన్నపాటి అలకా తొలగిపోయింది. 'చాల్లెండి..' అంటూ సరదాగా నవ్వేస్తూ టీ కప్పు అందించింది.

అందరూ తేలిగ్గా ఊపిరి తీసుకున్నట్లయి.. మామూలుగానే కబుర్లలో పడ్డారు.

అందరి మధ్యా చెంపదెబ్బ తిన్నానని అవమానంతో అమ్మ రెచ్చిపోలేదు. శాంతం వహించింది! నాన్న కూడా ఏమాత్రం అహం, భేషజం లేకుండా, గదిలో కాకుండా అందరి మధ్యా క్షమాపణ అడిగాడు! వాళ్లిద్దరూ సమస్యను పెద్దది చేసుకోకుండా సామరస్యంగా పరిష్కరించుకోగలిగారలా!

అందరూ వెళ్లిపోయాక, అమ్మ ఒంటరిగా ఉన్నప్పుడు పక్కన కూర్చుని ఆ విషయం గురించి అడిగాను. 'అందరి ముందూ కొట్టినందుకు, ఎదురుతిరగటమో, నిలదీయటమో కాకుండా నువ్వే తప్పు చేసినట్లుగా నాన్నని లాలిస్తున్నావేంటో, నే చూశాలే..' అన్నా.

అమ్మ చిన్నగా నవ్వింది.

'అలవాటుగా తప్పు చేసేవాళ్లని సమర్థించలేం గానీ, క్షణికావేశాన్ని అర్థం చేసుకోవాలి... అవునా? కొందరు తమ వాదనకు బలం చేకూర్చుకోవట మన్నట్లుగా ఆడవాళ్లపై చెయ్యి చేసుకుంటారు. మీ నాన్నకు అలాంటి అలవాటు లేదు! మరి అలాంటప్పుడు ఎందుకలా జరిగిందనే ఆదుర్దాయే గానీ నేనేం నామర్దాగా అనుకోలేదు! ఏ సంఘటనని అయినా బేరీజు వేసి చూసుకోవాలనుకున్నప్పుడు నా దగ్గర ఒక లెక్కడ ఉంది. ఒక చిన్న తప్పుకు తూకంగా నన్ను మెప్పించిన ఎన్నెన్నో అనుభూతులను వేసి చూసుకుంటే, అప్పుడు తెలుస్తుంది.. ఆ తప్పు క్షమార్హమా కాదా అన్నది! అర్థమైందిగా..?' అనడిగింది.

మళ్లీ నవ్వు మొహంతో చూసి 'అందరి ముందూ అవమానంగా కొట్టారనే దానికంటే, బెట్టు లేకుండా మెట్టు దిగి వచ్చి, 'కాళ్లు పట్టుకుంటా' అని అడగడం గొప్ప విషయంగా నాకనిపించింది!' అంది.

అప్పుడే నాకో విషయం అర్థమైంది. ప్రేమ బలంగా ఉన్నచోట.. తప్పు తేలికవుతుంది! అవును.. ప్రేమ వెంటే క్షమా ఉంటుంది!

నేరం తీవ్రతను బట్టే శిక్షా ఉండాలి గానీ.. అన్ని సమస్యలకీ ఒకే పరిష్కారమార్గం కాకూడదు! అందుకేనేమో... గుర్రాన్ని, గాడిదను ఒకే గాటను కట్టటమా అనే సామెత పుట్టింది! అవునా..?

ఇక ఇంకో సంఘటన గురించి చెబుతాను.

నా చదువు పూర్తయ్యిందని పించి ఉద్యోగాన్వేషణలో ఉండగా, మా నాన్న స్నేహితుడొకరు ఒక సలహా ఇచ్చారు. మాకు కొంచెం దూరంలోనే ఉన్న బస్తీలో ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులకు అన్ని విషయాల్లోనూ ట్రెనింగ్ ఇచ్చే ఇన్‌స్టిట్యూట్ పెట్టారనీ, అందులో చేరటం ప్రయోజనకరంగా ఉంటుందనీ!

ఆ వూళ్లోనే మా నాన్నకు చిన్నాన్న కొడుకు, నాకు వరుసకు బాబాయ్ అయ్యే ఆయన ఒకరున్నారు.

మా నాన్న చిన్నాన్న చిన్న వయసులోనే చనిపోతే, మా తాతయ్యే తన తమ్ముడి పిల్లలనూ సొంత పిల్లలుగా చూసుకున్నారట! వాళ్లు ఉద్యోగాలలో స్థిరపడ్డాక అంతగా రాకపోకలు లేవు.



ఒకే ఒక్క చెంప దెబ్బ కొట్టిన భర్తని క్షమించలేకపోవటం నాకు నిజంగానే నచ్చలేదు. ఇంతకు ముందు ఎంతో ప్రేమగా ఉన్న ఒక్కసారిగా మర్చిపోయి విడాకులకి వెళ్ళిపోవటం సమంజసమేనా?

